

గజగజ

ధాన్యం చేతికందే వేళ ఏనుగుల గుంపు వరిపంటలను తొక్కి నాశనం చేస్తున్నాయి. వరితో పాటు మామిడి, టమోటా, అరటి పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు ఇటీవల పొడవాటి కొబ్బరిచెట్లను సైతం నేలకూలుస్తున్నాయి.అదీకాక గ్రామాల్లోకి చొరబడి ఘీంకారాలు చేస్తుడడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలాల వైపు వెళ్లాలంటేనే గజగజ వణికిపోతున్నారు.

7

మిట్టమీదరాచపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అపార(ర్) కష్టాలకు విముక్తి

- అపార్ ఐడీ నమోదు కోసం స్కూళ్లలోనే మొబైల్ ఆధార్ కేంద్రాలు
- సవరణలకు నోటరీ అఫిడవిట్లు అవసరం లేదు
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సర్వీసు ఛార్జీలుండవు

7



రాష్ట్ర బడ్జెట్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు గణనీయంగా నిధుల కేటాయింపులు జరిగాయి. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా తదితర సాగునీటి ప్రాజెక్టులకు రూ. 4530 కోట్లు దక్కాయి. దీంతో ఐదేళ్ళ తర్వాత సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక రానుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు వివిధ కార్యక్రమాల కింద రూ. 350 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రెండు జిల్లాల పరిధిలోని యూనివర్శిటీలు, శ్రీసిటీ ఐఐటీ సంస్థలకు రూ. 500 కోట్లు ఇచ్చింది. పులికాట్ పరిధిలో మత్స్యకారులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పూడికతీత పనులకు రూ. 97 కోట్లు మంజూరు చేసింది. చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సైతం ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో రూ. 210 కోట్లు కేటాయించింది. గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు జిల్లాల పరిధిలో సాగునీటి, పారిశ్రామిక, విద్యా రంగాలకు నిధులేమీ కేటాయించని నేపథ్యంలో తాజాగా కూటమి ప్రభుత్వం జరిపిన నిధుల కేటాయింపులు రెండు జిల్లాల ప్రజలకు ఊరటనిస్తున్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



నిధులు ఘనం

చిత్తూరు,తిరుపతి జిల్లాలకు బడ్జెట్‌లో గణనీయంగా నిధుల కేటాయింపు

సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో ఇక కదలిక

తెలుగు గంగ ప్రాజెక్టు పనులకు రూ. 879.24 కోట్లు



ఎన్టీయార్ తెలుగు గంగ ప్రాజెక్టుకు మొత్తంగా ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనులకు గత వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 231.84 కోట్లు కేటాయించగా 2023-24లో రూ. 798.11 కోట్లు ప్రతిపాదించింది. అయితే బడ్జెట్ సవరణల్లో ఆ మొత్తాన్ని రూ. 619 కోట్లకు కుదించింది. ప్రస్తుత ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించినప్పటికీ అందులో సింహభాగం నెల్లూరు జిల్లా పరిధిలో ఖర్చు చేయనున్నారు. తిరుపతి జిల్లా విషయానికొస్తే అందులో సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులకు రూ. 66 కోట్లు రానున్నాయి. ఈ కెనాల్ పనులకు గత ప్రభుత్వం 2022-23లో రూ. 10.17 కోట్లు కేటాయించింది. అలాగే 2023-24లో రూ.41.92 కోట్లు కేటాయించినప్పటికీ తర్వాత దాన్ని బడ్జెట్ సవరణల్లో రూ. 4.19 కోట్లకు కుదించింది. దీంతో ఈ కెనాల్ పనులేమీ జరగలేదు. తాజా కేటాయింపులతో పనులు తిరిగి మొదలు కానున్నాయి. అలాగే తాజా బడ్జెట్‌లో తెలుగ గంగకు కేటాయించిన నిధుల నుంచీ కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ. 11 కోట్లు దక్కనున్నాయి. ఈ స్కీమ్‌కు గతేడాది కూడా బడ్జెట్‌లో రూ. 11.54 కోట్లు కేటాయించారు.

గాలేరు నగరికి రూ. 2438.94 కోట్లు



దశాబ్దాలుగా జిల్లా ప్రజలను ఊరిస్తున్న గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ. 2438.94 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు జరగని సంగతి తెలిసిందే. 2022-23లో నామమాత్రంగా రూ.275.48 కోట్లు కేటాయించినప్పటికీ పనులేమీ జరగలేదు. ఇక 2023-24లో రూ.855.34 కోట్లు తొలుత కేటాయించిన ప్రభుత్వం తర్వాత బడ్జెట్ సవరింపుల్లో దాన్ని రూ. 2072.86 కోట్లకు పెంచింది. నిధుల కేటాయింపును పెంచినా పనులు మాత్రం మొదలు కాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో పనులు వేగంగా జరగగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటివరకూ అమల్లో వున్న టెండర్లను రద్దు చేయడంతో పాటు ఏకంగా ప్రాజెక్టు డిజైన్‌ను కూడా మార్చివేసింది. శేషాచల అడవుల్లో టన్నెల్ నిర్మాణానికి బదులు గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని తంబళ్ళపల్లి, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల మీదుగా తూర్పు ప్రాంతానికి తరలించేలా ప్రణాళికను మార్చింది.కానీ దానికి నిధులేవీ కేటాయించలేదు. ఇపుడు కూటమి ప్రభుత్వం తొలి ఏడాది బడ్జెట్‌లోనే ఏకంగా రూ. 2438 కోట్లు కేటాయించడంతో మునుపటి డిజైన్ ప్రకారమే పనులు సజావుగా సాగుతాయని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

హంద్రీ-నీవాకు రూ. 2014.23 కోట్లు

చిత్తూరు జిల్లాకు ప్రాణాధారంగా మారనున్న హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్ళూ విస్మరించగా కొత్త ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే గణనీయంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 979.73 కోట్లు కేటాయించినా పనులేవీ చేపట్టలేదు. 2023-24లో తొలుత రూ.270.14 కోట్లు కేటాయించిన అప్పటి ప్రభుత్వం తర్వాత దాన్ని రూ. 486.37 కోట్లకు పెంచింది. అయినప్పటికీ ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప ఈ ఐదేళ్ళలో కాలువ తవ్వకాలు గానీ, రిజర్వాయర్ల పనులు గానీ జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో తంబళ్ళపల్లి, మదనపల్లె, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలకు హంద్రీ-నీవా జలాలందించిన చంద్రబాబు తాజా బడ్జెట్ కేటాయింపులతో ఈ పర్యాయం పీలేరు, పలమనేరు నియోజకవర్గాలకు నీరందించే అవకాశం కనిపిస్తోంది.





తిరుపతి కార్పొరేషన్‌కు రూ. 350 కోట్లు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద వివిధ అభివృద్ధి పనులకు రూ. 20 కోట్లు రానుండగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద వాడిన నీటిని తిరిగి వినియోగించేలా మార్చేందుకు రూ. వంద కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 16.17 కోట్లు, ఇతర ఖర్చులకు 6.50 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు రూ. 75.94 కోట్లు, సామర్థ్యాల పెంపునకు రూ. 27.29 కోట్లు, సిబ్బంది వేతనాలకు రూ. 78.80 కోట్లు చొప్పున ఇతర నిధులు దక్కాయి. అలాగే నగరంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడానికి రూ. 25.58 కోట్లు కేటాయించారు.

హామీలను నెరవేర్చే దిశగా

ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సీఎం చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టించారు. ఉన్నత విద్య, ఆరోగ్య రంగం, పంచాయతీ రాజ్, పట్టణాభివృద్ధిశాఖ, రవాణా, హౌసింగ్, పరిశ్రమలు, ఇరిగేషన్ తదితర రంగాలకు గత ప్రభుత్వంలో కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. సంక్షేమ శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖలకు అధికంగా కేటాయింపులు చేయడం సంతోషకరం.

- గురజాల జగన్మోహన్ , చిత్తూరు ఎమ్మెల్యే

మాట మార్చిన ప్రభుత్వం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పట్నుంచీ అమలు చేస్తారో బడ్జెట్‌లో చెప్పలేదు. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరం. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల నివారణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం. పెన్షన్ల పెంపు, ఉచిత సిలిండర్ల గురించి ఘనంగా చెప్పిన ఆర్థిక మంత్రి ఉచిత బస్సు సౌకర్యం గురించి ప్రస్తావించలేదు.

-నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

మహిళలకు పెద్దపీట

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో భాగంగానే ఉచిత సిలిండర్ పథకాన్ని అమలు చేసింది.తల్లికి వందనం పథకాన్ని కూడా త్వరలో అమలు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రస్తావించడం సంతోషకరం.డ్వాక్రా సంఘాలకు గతంలో కంటే రెట్టింపుస్థాయిలో రుణాలు మంజూరు చేసేలా నిధులు కేటాయించడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

- ఆరణి కవిత, జనసేన రాష్ట్ర కార్యదర్శి

ఉన్నత విద్యా సంస్థలకు రూ. 500 కోట్లు



జిల్లాలో ఉన్నత విద్యా సంస్థలకు కొత్త ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించింది. ఎస్వీయూకు తాజా బడ్జెట్‌లో రూ. 226.38 కోట్లు కేటాయించగా ఈ వర్శిటీకి 2022-23లో 263 కోట్లు, 2023-24లో రూ. 211.83 కోట్లు చొప్పున వచ్చాయి. ఎస్వీ వెటర్నరీ వర్శిటీకి గతేడాది రూ. 127.85 కోట్లు దక్కగా ఈ పర్యాయం రూ. 153 కోట్లు కేటాయించారు. ఇక పద్మావతీ మహిళా వర్శిటీకి రూ. 72.73 కోట్లు ఈ బడ్జెట్‌లో దక్కగా ఇదే వర్శిటీకి 2022-23లో 52.22 కోట్లు, 2023-24లో రూ. 51.74 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి. కుప్పంలోని ద్రవిడ యూనివర్శిటీకి తాజా బడ్జెట్‌లో రూ. 27.91 కోట్లు కేటాయించారు. ఈ వర్శిటీకి 2022-23లో రూ. 18.48 కోట్లు, 2023-24లో రూ. 23.17 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి.శ్రీసిటీలో కొత్తగా ఏర్పాటవుతున్న ఐఐటీకి కూటమి ప్రభుత్వం రూ. 19.52 కోట్లు కేటాయించింది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన దశలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులు తిరుపతి, చిత్తూరు జిల్లాల అభివృద్ధికి మేలు చేస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

సమర్థవంతమైన బడ్జెట్

రాష్ట్రంలోని వనరులను వినియోగించుకుని సమర్థవంతమైన బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జగన్ ప్రభుత్వం అప్పుల పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసినా.. సంక్షేమం వైపు అడుగులు వేసేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అభినందనీయం

-జగదీశ్వర నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

చిన్నపిల్లల బడ్జెట్

సీఎం చంద్రబాబు సంపద సృష్టికర్త అంటారు.. ఈ ఐదు నెలల్లో ఆయన ఎంత సంపద సృష్టించారో తెలియజేయాలి.చివరకు అయోమయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆరు నెలల్లో రూ.25 వేల కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా.. ఇంతవరకు ఎంత ఆదాయం వచ్చిందో చెప్పాల్సి ఉంది. ఇది చిన్న పిల్లల బడ్జెట్. సామాన్య ప్రజానీకానికి ఒరిగేదేం లేదు.

- విజయానందరెడ్డి, వైసీపీ నేత

అందరికీ ఆమోదయోగ్యం

వైసీపీ ప్రభుత్వంలోలాగా కాకుండా ఈసారి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదయోగ్యంగానే ఉంది. పూర్తిస్థాయిలో ఆచరణలోకి వస్తే మరింత బాగుంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ఇకనైనా అమలు చేయాలి.

- పి. భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణం

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు బడ్జెట్ అనుగుణంగా ఉంది. వ్యవసాయ, సాగునీటి రంగాలకు అత్యధిక నిధులు కేటాయించారు. విద్య, వైద్య రంగాలతో పాటు అట్టడుగు, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధికి కూడా విరివిగా నిధులు కేటాయించడం సంతోషించదగ్గ విషయం.

- గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ

వీఆర్‌కు సీఐ జీటీ నాయుడు



కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం సీఐ జీటీ నాయుడిని వీఆర్ (వేకన్సీ రిజర్వ్)కు పంపుతూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగైదు రోజులుగా సీఐ జీటీ.నాయుడు స్టేషన్‌లో లేరు. కోర్టు పనిమీద విజయవాడ వెళ్లినట్లు పోలీసు వర్గాలు చెబుతూ వచ్చాయి. అయితే ఆయన్ను వీఆర్‌కు పంపుతూ, అనంతపురం డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఎస్పీ ఈ నెల 9వ తేదీన ఉత్తర్వులు వెలువరించారు. స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదు వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలిసింది.అర్బన్ సీఐగా జీటీ.నాయుడు పనితీరు బాగాలేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఐ వీఆర్‌కు వెళ్లాల్సి వచ్చినట్లు తెలిసింది. ఈ ఏడాది జూన్ 25వ తేదీన సీఐగా బాధ్యతలు తీసుకున్న జీటీ నాయుడు కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే వీఆర్‌కు బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. కాగా కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌కు ఇన్‌ఛార్జి కుప్పం అర్బన్ సీఐగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న శ్రీధర్‌బాబు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవార్డులు ప్రదానం చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో నిర్వహించింది. అవార్డులు అందుకున్న వారిలో.. కె.శ్రీధర్‌బాబు (గ్రేడ్2 హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, మేలుమాయి, గంగవరం మండలం) కె.సురేంద్రబాబు (స్కూల్ అసిస్టెంట్- బయాలజీ, జడ్పీహెచ్ఎస్, కాణిపాకం, ఐరాల మండలం) పి.మహ్మద్ అలీ (ఎస్ఏ-మ్యాథ్స్, జడ్పీహెచ్ఎస్- ఉర్దూ, వి.కోట మండలం), కె.మాలిక్ మొహిద్దీన్ (ఎస్ఏ- సోషల్, జడ్పీహెచ్ఎస్, పూనేపల్లి, పెనుమూరు మండలం), డి.శ్రీదేవి (జేఎల్ -హిందీ, కృష్ణవేణి జూనియర్ కళాశాల, చిత్తూరు) ఉన్నారు. వీరిని పలువురు అభినందించారు.



చంద్రబాబు,లోకేష్‌లనుంచి అవార్డులు అందుకుంటున్న సురేంద్రబాబు-శ్రీదేవి-మాలిక్ మోహిద్దీన్-మహ్మద్ ఆలీ

ఓవరాల్ చాంపియన్ చిత్తూరు

- ముగిసిన రాష్ట్రస్థాయి కుస్తీపోటీలు
- విజేతలుగా బాలుర విభాగంలో శ్రీకాకుళం, బాలికల విభాగంలో విశాఖ జట్లు

యాదమరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల కుస్తీ పోటీలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజున ఫైనల్స్ రసవత్తరంగా జరిగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐదు బంగారు పతకాలతోపాటు వివిధ విభాగాల్లో అత్యధిక పాయింట్లు సాధించడంతో ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. బాలుర విభాగంలో ఉమ్మడి శ్రీకాకుళం, బాలికల విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లాల క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు డిసెంబరు రెండో తేదీనుంచి డిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, భాస్కర్‌రావు, జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, పీడీలు షఫీ, హరి, దాము, వివిధ జిల్లాల నుంచి వచ్చిన శిక్షకులు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో..

ఉమ్మడి చిత్తూరు జిల్లా మూడు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, అనంతపురం ఉమ్మడి జిల్లాలు ఒక్కొక్కటి చొప్పున బంగారు పతకాలు సాధించాయి.

బాలికల విభాగంలో..

ఉమ్మడి విశాఖ జిల్లా మూడు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. చిత్తూరుకు రెండు బంగారు పతకాలు రాగా.. కృష్ణా, నెల్లూరు, అనంతపురం, తూర్పు గోదావరి ఒక్కొక్కటి చొప్పున బంగారు పతకాలు సాధించాయి.



ఓవరాల్ చాంపియన్స్ ట్రోఫీతో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్టు



45 కిలోల విభాగంలో శ్రీకాకుళం, తూర్పు గోదావరి బాలికలు

75 కిలోల విభాగంలో తలపడుతున్న నెల్లూరు, చిత్తూరు బాలికలు



55 కిలోల విభాగంలో విజయనగరం, ప్రకాశం బాలురు

80 కిలోల విభాగంలో తలపడుతున్న అనంతపురం, నెల్లూరు బాలురు

శైవక్షేత్రాల్లో దీపకాంతులు

కార్తీక మాసం రెండో శుక్రవారం. సాయం సంధ్యవేళ శైవక్షేత్రాల్లో భక్తులు నేతి దీపాలు వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతిలోని కపిలతీర్థంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.







వెలుగులీనుతున్న శ్రీకాళహస్తిలోని వైష్ణవ కోనేరు



కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సమస్య మళ్లీ మొదటికే..!

- మళ్లీ సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు

కేవీబీపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు మాట తప్పారంటూ కేవీబీపురం మండలం కళత్తూరు దళిత రైతులు మళ్లీ సెల్ టవరెక్కారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కిందకు దిగమంటూ సోమవారం సాయంత్రం భీష్మించారు. కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెం.4లోని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఆ భూములు తమవంటూ అటవీశాఖ అడ్డంకులు కల్పిస్తోందంటూ శనివారం ఉదయం ఈ రైతులు సెల్ టవర్ ఎక్కిన విష యం తెలిసిందే. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఎఫ్‌ఆర్వో రాధికారెడ్డి తదితరులు సమస్యను వంద రోజుల్లో పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో దిగొచ్చారు. కాగా, ఆదివారం భూముల వద్దకు వెళ్తున్న తమను అటవీశాఖ అధికారులు అడ్డగించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తిరిగి భూముల వద్దకు వెళ్లితే ఎఫ్ఆర్వో మాధవిరెడ్డి అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడారన్నారు. వీరి తీరుకు నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పురుగులమందు డబ్బాలతో టవర్‌పైకి ఎక్కారు.పోలీసులు వారికి నచ్చజెప్పినా పట్టించుకోలేదు. సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కళత్తూరు దళిత రైతులతో చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటలకు వీరు రైతులతో చర్చించారు. రైతులు మాత్రం ససేమిరా అన్నారు. ఇంతలో నలుగురు మహిళలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు.పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకుండా కాపాడారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు టవర్ దిగేది లేదని రైతులు తెగేసి చెప్పారు.



బడ్జెట్‌పై నేతల మాట

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ కూటమికే చెల్లింది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ఆశాజనకంగా లేదు

బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగ భృతి, ఎస్సీలకు మేలు చేసేలా ఆశించినంత లేదు. హడ్కో రుణాలను చక్రవడ్డీలతో తీసుకురావడం ఏమిటో అర్థం కావడంలేదు. అప్పులు తీసుకురావడంలో గత ప్రభుత్వంతో పోటీ పడుతున్నట్లుంది.

- డాక్టర్ చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి

వెనుకబడిన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రూ3097కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. టీడీపీ తొలినుంచీ వెనుకబడిన వర్గాలకు బడ్జెట్లో అగ్రస్థానం కల్పిస్తోంది. ఇప్పుడూ బీసీలకు వెన్నుదన్నుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టడం హర్షదాయకం.

- నరసింహ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్

ఏపీ భవిష్యత్తు మారబోతోంది

బడ్జెట్‌లో ప్రజా శ్రేయస్సు, సర్వతోముఖాభివృద్ధితో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కనిపిస్తోంది. మహిళలు, నిరుద్యోగులు చిన్న చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను మంజూరుకు పెద్దపీట వేయడం హర్షణీయం. గత ఐదేళ్లుగా అధోగతిలోకి వెళ్లిపోయిన ఏపీ భవిష్యత్తు కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో మారబోతోంది.

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు

వేతన జీవులగురించి పటించుకోఏలేదు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు,వారి ఉద్యోగ భద్రత గురించి ప్రస్తావన లేదు. ఇది బాధాకరం.

- కందారపు మురళి,
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

యువతకు పెద్దపీట

ఉన్నత విద్యకు రూ.2,326 కోట్ల కేటాయించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ.1,215 కోట్లు వెచ్చించనున్నారు. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు రూ.322 కోట్లు కేటాయించడంతో పాటు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం బాగుంది. యువతకు పెద్దపీట వేసినట్లు కనిపిస్తోంది.

-డాక్టర్ కొండేటి సునీత,
ఎకనమెట్రిక్స్ డిపార్ట్‌మెంట్, ఎస్వీయూ

అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం

పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు రూ.3,127 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

- మోహన్‌కుమార్‌రాజు,
తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

పాజెక్టులకు మొండి చేయి

రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రస్తావించలేదు. ట్రూఆఫ్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీపై ప్రకటన లేదు.

- ఎ.రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

నేర ప్రవృత్తికి దూరంగా ఉండండి

- యువతకు తిరుపతి ఎస్పీ హితబోధ
- పద్మావతి వర్సిటీలో అవగాహనా కార్యక్రమానికి విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు ఎస్పీ సుబ్బరాయుడు హితబోధ చేశారు. సైబర్, డ్రగ్స్ నేరాలు, చిన్నారులు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమలోని ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలను దేశ.. వ్యక్తిగత భవిష్యత్తు కోసం ఉపయోగించాలని కోరారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన శిక్షలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 100, 112 కు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ క్రైం బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల తెలియక అనేక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సైబర్ క్రైం బాధితుల్లో డిగ్రీ లోపు యువత ఎక్కువగా ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిన్నారులపై అత్యాచార ఘటనల్లో ఎక్కువగా పక్కింటి వారు, తెలిసిన వారే బాధ్యులుగా ఉంటున్నారన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి సరఫరాకు కాలేజీలను అడ్డాగా మార్చుకొని అక్రమ దందా సాగిస్తున్నారన్నారు. మత్తు పదార్థాల నివారణకు విద్యార్థులు, అధ్యాపకుల సహకారం ప్రభుత్వానికి అవసరమన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పద్మావతి వర్సిటీ వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా విద్యార్థులు తమ పరసరాల్లోని వారికి అవగాహన కల్పించాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు

సృష్టిలో ఏదీ మనది కాదు

- రాధా మనోహర్ దాస్



చిత్తూరు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ సృష్టిలో ఏదీ మనది కాదని ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగవత్ వైభవం ప్రవచన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించి, ప్రవచించారు. మనం నిత్యం నిర్వహించే కర్తవ్యాల్లోనే భగవంతుడు ఉన్నాడన్నారు. నిర్వాహకులు కళ్యాణ్ చక్రవర్తి, సీతమ్స్ మునివేలు, జీడి గోపి, పోతుల రామ్మూర్తి, కేవీఆర్ నారాయణమూర్తి, వెంకటా చలపతి, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

'ప్రకృతి' సాగుతో అధిక దిగుబడి: జేడీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలపై రైతులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక రైతు సాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు వర్క్‌బుక్, బుక్‌లెట్‌లను అందజేశారు. డీపీఎం వాసు, సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

నింద్ర, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. శ్రీరామపురం పంచాయతీ శ్రీరామపురంలో దాము(45) వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. సోమవారం ఉదయం పనులకు వెళుతుంటే పొలంగట్టుపై పాటు కాటు వేయడంతో స్పృహ కోల్పోయాడు. సహచర కూలీలు వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందారు. భార్య, ఇద్దరు పిల్లలున్న ఇతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దాము (ఫైల్ ఫొటో)

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసిన కలెక్టర్, జేసీ, తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు దివ్యాంగులకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వీటిని అందజేసినట్లు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, సంబంధిత శాఖాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సముద్రపు కాకుల సందడి







తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని కొండూరుపాళెం ప్రాంతంలో సీగల్స్, పెయింటెడ్ స్టార్క్స్ సందడి చేస్తున్నాయి. చలికాలం మొదలవగానే విదేశాల నుంచి ఈ విహంగాలు వచ్చి దిగాయి. చిన్న చేపలూ, రొయ్యలూ, ఎంట్రకాయలూ వేటాడే ఈ పక్షులను సముద్రపు కాకి, కాస్పియన్ టెర్న్ అని కూడా అంటారు. పరిణామంలో చిన్నదైనా చాలా ఎత్తుకి ఎగురుతూ వేగంగా కిందకి దూసుకు వస్తుంది. ఇవి గుంపులుగానే కనిపిస్తుంటాయి. సమూహాలుగా దేశాలు దాటి ప్రయాణిస్తాయి. పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగ) వెదురు పట్టులో చింత చెట్లమీద ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటుంది. సముద్రపు కాకులు నేలపట్టులో కనిపించవు. పులికాట్‌లో అక్కడక్కడా తారసపడుతాయి. కాకినాడ్ హోప్ ఐలెండ్స్‌లోనూ ఇవి ఇదే కాలంలో కనిపిస్తాయి. అయితే వీటి సంఖ్య అక్కడ 200 కి మించి ఉండదని అంటారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం ఉప్పుటేరులో మాత్రం వందలాదిగా సముద్రకాకులు సందడి చేస్తున్నాయి.

-వాకాడు,ఆంధ్రజ్యోతి





పౌష్టికాహారంలో పురుగులు

ఆందోళనలో బాలింతలు, గర్భిణులు



చిక్కీల్లో పురుగులు

గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం కింద పంపిణీ చేసిన చిక్కీల్లో పురుగులు దర్శనమివ్వడంతో వారు ఆందోళనకు గురయ్యారు.పురుగులున్న చిక్కీలను అంగన్‌వాడీ సిబ్బందికి సోమవారం చూపించిన బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగవరం మండలం వి.రామాపురంలోని మినీ అంగన్‌వాడీ సెంటర్‌కు పౌష్టికాహార కిట్లను ఈనెల 4వ తేదీన కాంట్రాక్టరు అందజేయగా అదేరోజున అంగన్‌వాడీ సిబ్బంది పంపిణీ చేసేశారు.చిక్కీలను తినడానికి కవర్‌ను ఓపెన్ చేసిన ఓ బాలింత పురుగులు కనపడడంతో, ఆశ్చర్యపోయింది.అంగన్‌వాడీ సిబ్బందికి విషయం తెలియజేసి పురుగులు బయటపడ్డ చిక్కీలను అందజేశారు. ఈ విషయమై ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో పుష్పను వివరణ కోరగా చిక్కీల్లో పురుగులున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని చెప్పారు. పంపిణీ చేసిన కాంట్రాక్టరును హెచ్చరించామని, ఇకపై ఇలాంటివి జరక్కుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. పౌష్టికాహార కిట్లను అందజేసే ముందు అధికారులు తనిఖీ చేస్తే ఇలాంటి తప్పులు జరగడానికి ఆస్కారముండదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు.

15న వరసిద్ధుడికి అన్నాభిషేకం

ఐరాల(కాణిపాకం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామికి ఈనెల 15వ తేదీన అన్నాభిషేకాన్ని ఉభయదారులు నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ సోమవారం తెలిపారు. దివంగత సుబ్బరాయులుశెట్టి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజున ప్రధాన ఆలయంలో ఉదయం నాలుగు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే సుప్రభాత సేవ, మొదటి కాల అభిషేకం, సహస్ర నామార్చన, పాలాభిషేకం టికెట్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రద్దు చేసినట్లు వివరించారు. గోపూజ, ఉదయం మహాహారతి, సాయంత్రం ప్రమాణాలు, పాలాభిషేకం, మహాహారతులు యథావిధిగా జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు గాయాలు



కమలమ్మ మృతదేహం

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీ గుంతలచేను గ్రామానికి చెందిన కమలమ్మ(26), సుబ్రహ్మణ్యం దంపతులు తిరుపతిలోని ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తూ.. అక్కడే కాపురం ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వెళ్లి సోమవారం ద్విచక్ర వాహనంలో తిరుగుప్రయాణమయ్యారు. తిరుపతి-పచ్చికాపల్లం రహదారిలోని రామచంద్రాపురం మండలం గంగమాంబపురం వద్దకొచ్చేసరికి ఎదురుగా ఆవు రావడంతో దాన్ని తప్పించబోయి కిందపడ్డారు. వెనుక కూర్చొని ఉన్న కమలమ్మకు తీవ్రగాయాలవడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. సుబ్రహ్మణ్యం కూడా గాయపడ్డాడు. ఆర్సీపురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూకాల్లో మరీ ఇంత మోసమా?

● చిత్తూరులో ఒకే రోజు 30 దుకాణాలకు నోటీసులు



చేపల మార్కెట్, నూనె దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూకాల్లో మరీ ఇంత మోసమా.. అంటూ తూనికలు కొలతల అధికారులే ఆశ్చర్యపోయారు. చిత్తూరు నగరంలోని హోల్‌సేల్ బియ్యం దుకాణాలు, చేపల మార్కెట్, చికెన్ సెంటర్లు, ప్రొవిజన్ స్టోర్స్, హార్డ్‌వేర్స్, ఎలక్ట్రికల్స్ తదితర దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. 50 గ్రాముల నుంచి రెండు కిలోల వరకు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది. బియ్యం బస్తాపై 26 కిలోలు అని ముద్రించి ఉండగా, తూకం వేస్తే 25 కిలోలే ఉంటాన్ని, నూనె డబ్బాలు, ప్యాకెట్లలోనూ తేడాలు గమనించారు. చేపల మార్కెట్‌లోని కొన్ని దుకాణాల్లోనూ తూకాల్లో మరీ ఎక్కువ తేడాలు ఉండటంతో ఆ వేయింగ్ మిషన్లను సీజ్‌చేశారు. ఎడిబుల్ ఆయిల్ దుకాణంపై ఒకటి, చేపల మార్కెట్‌లోని దుకాణాలపై 5, చికెన్ దుకాణాలపై 5, ప్రొవిజన్ అండ్ ఫ్యాన్సీ దుకాణాలపై 7, బియ్యం దుకాణాలపై 8, హార్డ్‌వేర్ షాపులపై 3, ఎలక్ట్రికల్ షాపులపై రెండు కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో చిత్తూరు తూనికలు కొలతల శాఖ సీఐ దివ్య, ఎస్ఐ మల్లేశ్వర్, తిరుపతి సీఐ రమాదేవి, పలమనేరు సిబ్బంది పాల్గొన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే 93981 58259కు ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి: కలెక్టర్



కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ పంటల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్య కరదీపికను ఆయన ఆవిష్కరించారు. జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు మధుసూదన్, మురళీకృష్ణ, ఏపీఎంఐపీ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, ఎల్డీఎం హరీష్, డీపీఎం వాసు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉద్యానశాఖ తయారుచేసిన మామిడి పంటలో సస్యరక్షణ చర్యలకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

టీచరుకు పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మహర్షి విద్యామందిరం టీచరు పి.దేశమునికి సోమవారం పూర్వవిద్యార్థులు రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. దేశముని అనారోగ్యానికి గురవడంతో సమాచారం తెలుసుకున్న పూర్వ విద్యార్థులైన పుత్తూరు పురంధర్‌రెడ్డి, గఫూర్, దాము, హేమాద్రిలు ఈ సాయం చేశారు.

వెల్లువెత్తిన వినతులు

పీజీఆర్ఎస్‌కు రెవెన్యూ సమస్యలే ఎక్కువ



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 131 మంది అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ సమస్యలపైనే 104 అర్జీలు అందాయి. ఫారెస్టు, పంచాయతీరాజ్, దేవదాయ శాఖ, చిత్తూరు, నగరి, పుంగనూరు మున్సిపాలిటీ, తదితర శాఖలకు కలిపి 27 అర్జీలు ఉన్నాయి.



గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మించాలంటూ కలెక్టరేట్‌కు వచ్చిన నాగన్నకండ్రిగవాసులు

పోలీసు కార్యాలయంలో 37 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 37 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. భూ తగాదాలపై 10, డబ్బు తగాదాలపై 7, ఆస్తి తగాదాలపై 6, కుటుంబ, ఇంటి తగాదాలపై 4 చొప్పున, వేధింపులపై 4, చీటింగ్‌పై రెండు అర్జీలు అందాయి.

ప్రధాన సమస్యలిలా..

- దారి సమస్యను పరిష్కరించాలని పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీలోని డి.మిట్టూరు, దొమ్మాండ్లపల్లె, బీసీ కాలనీ ప్రజలు కోరారు. పాపరాజుపల్లెకు భారతి, జీఎంఎస్ రెడ్డి చెందిన పొలాల మీదుగా దారిని ఉపయోగించుకునేవారమన్నారు. గ్రామస్తుల కోరిక జీఎంఎస్ రెడ్డి కొంత స్థలాన్ని రోడ్డుకు వదిలారని, భారతిరెడ్డిని అడిగితే స్థలాన్ని వదలకపోగా రాతికూసాలను నాటారన్నారు. భారతికి చెందిన భూమిలోనే 12 లింకుల స్థలాన్ని రోడ్డుకు కేటాయించి ఉందన్నారు. సర్వే చేసి, దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- గతంలో తనకు 1.50 సెంట్ల ఇంటిస్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని జీడీ నెల్లూరు మండలం దిగువమాసాపల్లెకు చెందిన మునిరత్నమ్మ తెలిపారు. కుటుంబ పోషణ కష్టంగా ఉన్నందున ఇంటి నిర్మాణాన్ని చేయలేదన్నారు. ప్రస్తుతం తనకిచ్చిన స్థలాన్ని సర్వే చేసి ఇస్తే ఇల్లు కట్టుకుంటానని చెప్పారు.
- రెండు కాళ్లు, రెండు చేతులూ సహకరించడం లేదని తవణంపల్లె మండలం సిద్ధంపల్లెకు చెందిన గోవిందరాజులు కోరారు. అంగవైకల్యం ఉన్నందున ప్రభుత్వం ప్రస్తుతం రూ.6వేలను పింఛనుగా ఇస్తోందన్నారు. పూర్తిగా లేవలేని స్థితిలో ఉన్నానని, కుటుంబ పోషణ కోసం రూ.15వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.
- తన ఎవ్వరూ లేరని, వృద్ధాప్య పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని చిత్తూరు గిరింపేటకు చెందిన శక్తివేలు(63) కోరారు. ప్రస్తుతం కూలి పనులు కూడా చేయలేకున్నాని ఆవేదన వ్యక్తం చేశారు.
- తమ గ్రామానికి వాటర్‌ట్యాంకు నిర్మించాలని జీడీ నెల్లూరు మండలం నాగన్నకండ్రిగ గ్రామస్తులు కోరారు. కరెంటు వచ్చినప్పుడే నీళ్లు వస్తున్నాయని, పనులకు వెళ్లేవారు ఆ సమయంలో ఇంటి వద్ద ఉండలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.
- 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నేతలు కోరారు. ప్రధానంగా ఉద్యోగులకు అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. అలాగే 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

గజదాడులతో పంటలకు అపార నష్టం





కొబ్బరి చెట్టును నేలకూల్చిన ఏనుగులు - ఏనుగుల దాడిలో ధ్వంసమైన కోళ్లఫారం

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళంపేట పంచాయతీ మిట్టమీదరాచపల్లి వద్ద ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు ఏనుగులు వరి, కొబ్బరి, మామిడి తదితర పంటలను ధ్వంసం చేశాయి. ముందుగా చాకలికోన నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు మిట్టమీదరాచపల్లి వద్దకు రాత్రి పది గంటల సమయానికి చేరుకున్నాయి. ఇది గమనించిన అటవీశాఖ అధికారులు టపాకాయలు పేల్చడంతో సమీపంలోని మామిడితోటలోకి వెళ్లాయి. ఏనుగుల గుంపు అడవివైపు వెళ్లిపోయాయనుకున్న అటవీశాఖ అధికారులు సమీప గ్రామాలకు విద్యుత్ సరఫరాను ఆపించారు. అయితే మామిడితోటలో మాటువేసిన ఏనుగులు చీకటిలో పొలాల వైపు మళ్లి వరి, అరటి, మామిడి పంటలను ధ్వంసం చేసి కొబ్బరిచెట్లను నేలకూల్చాయి. సమీపంలోని కోళ్లఫారం రేకులను విరిచేశాయి. మిట్టమీదరాచపల్లిలోని రైతు కృష్ణారెడ్డికి చెందిన ఓతకు వచ్చిన వరిపంటను ధ్వంసం చేశాయి. రైతు రామచంద్రయ్య మామిడిచెట్లు, నీటి పైపులను ధ్వంసం చేశాయి. మరో రైతు పురుషోత్తం రెడ్డి కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు కోళ్లఫారంలోకి చొరబడి రేకులను విరిచేసి విధ్వంసం సృష్టించాయి. మరో రైతు శివారెడ్డికి చెందిన కొబ్బరిచెట్లను సైతం నేలకూల్చాయి. ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను చూసి కుమిలిపోయారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీఓ మున్నా పరిశీలించారు. ఏనుగులను కాపాడేందుకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారని, ఆ సమయంలో గ్రామాల్లోకి చొరబడుతున్న ఏనుగులు మనుషులపై దాడి చేస్తే బాధ్యులెవరని అటవీశాఖ అధికారులను రైతులు కృష్ణారెడ్డి, శివారెడ్డి, పురుషోత్తం రెడ్డి, నారాయణ, రామచంద్రయ్య నిలదీశారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

చిత్తూరు రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ-1 డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎం కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. బంగారుపాళ్యం, అరగొండ, తవణంపల్లె, ఐరాల, యాదమరి, చిత్తూరు రూరల్ ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఇందుకోసం 99592 25674 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

8 మంది ఎర్రచందనం కూలీల అరెస్టు



ఎర్రచందనం కూలీలను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగవరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ముసుగులో పోలీసులను బోల్తాకొట్టించి తమిళనాడుకు పరారవుతున్న ముఠా గుట్టును పలమనేరు పోలీసులు రట్టు చేశారు. 12 మంది ఎర్ర కూలీలను అరెస్ట్ చేసి, కారును సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు పలమనేరు అర్బన్ సీఐ నరసింహరాజు తెలిపారు. సీఐ కథనం మేరకు... పలమనేరు మండలం కాలువపల్లె చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇంతలో పోలీసులను గమనించి కారులోనుంచి ఇద్దరు మైనర్లు దిగి పరుగు తీయగా, పోలీసులు వెంబడించి పట్టుకొని కారులో ఉన్న వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎర్ర చందనం కూలీమంటూ అంగీకరించారు. గత నెల 21వ తేదీన కూడా వినోద్‌కుమార్, సేటు అనే ఎర్ర స్మగ్లర్ల ఆదేశాల మేరకు 12 ఎర్రచందనం దుంగలను కత్తిరించి చిన్నముక్కలుగా చేసి ఇన్నోవా కారులో తరలిస్తూ, పోలీసులను చూసి కారును వదిలేసి పరారైనట్లు అంగీకరించారు. దీంతో పట్టుబడిన తమిళనాడుకు చెందిన యం.శరవణ(34), బాబు(28), మత్తివన్నన్(26), విజయకుమార్(22), శక్తివేలు(34)తోపాటు మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ తెలిపారు. వినోద్‌కుమార్, సేటులను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది పాల్గొన్నారు.



సుస్మితకు ప్రసాదం అందిస్తున్న కోదండపాణి

వరసిద్ధుడి సేవలో మెగాస్టార్ కుమార్తె

ఐరాల(కాణిపాకం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మరో 13 మంది అరెస్టు

● రెండు ఆటోలు, కత్తులు, గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం

కల్లూరు,(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో సోమవారం సాయంత్రం తమిళనాడుకు చెందిన 13 మంది ఎర్రచందనం కూలీలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదుపులోకి తీసుకొని కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిత్తూరు నుంచి పీలేరు వెళుతున్న రెండు ప్యాసింజర్ ఆటోలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించారు. కల్లూరు బస్టాండు సమీపంలోని చిత్తూరు రోడ్డు వద్దకు రెండు ప్యాసింజర్ ఆటోలు చేరుకోగానే పోలీసులు తమ వాహనాలను వెనుకనుంచి వచ్చి అడ్డుపెట్టారు. పోలీసులు ఆటోల వద్దకు చేరుకొని 13 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాము పీలేరుకు బాడుగకు వచ్చామంటూ ఆటోల డ్రైవర్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తెలిపారు. ఆటోలో ఉన్న కత్తులు, గొడ్డళ్లు, రంపాలు, బియ్యం బస్తాలు తదితర సామగ్రిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

14నుంచి ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్యాధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి ఇంటి వద్దే నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబంలోనూ 18 ఏళ్లకు పైబడినవారికి బీపీ, షుగర్, గుండెజబ్బులు, థైరాయిడ్, పక్షవాతం, బ్రెస్ట్ క్యాన్సర్ మొదలైన వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్లు తమ పరిధిలో రెండు ఇండ్లను స్ర్కీనింగ్ చేయాలని, 13న ఆశా కార్యకర్తలు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. 14 నుంచి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సీహెచ్‌వో రోజుకు ఐదు ఇళ్ల స్ర్కీనింగ్ చేయాలన్నారు. డీసీహెచ్ఎస్ ప్రభావతి మాట్లాడుతూ ఎవరికైనా గుండెనొప్పి ఉంటే వారిని 108 వాహనం ద్వారా ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తే, ఈసీజీ ద్వారా నిర్ధారణ చేశాక రూ.45వేల విలువచేసే ఇంజక్షన్లు అందించి వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌వో ప్రభావతీ దేవి, వైద్యశాఖ అధికారులు వెంకటప్రసాద్, హనుమంతరావు, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ శిరీష, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అపార్ ఐడీ నమోదు కోసం స్కూళ్లలోనే మొబైల్ ఆధార్ కేంద్రాలు

● ఆధార్‌లో సవరణలకు అఫిడవిట్లు అవసరం లేదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ నమోదు కోసం ఇక పాఠశాలల్లోనే మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన 'అపా(ర్)ర కష్టాలు' కథనంపై కలెక్టర్ స్పందించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో సమావేశాన్ని నిర్వహించారు. అలాగే టెలికాన్ఫరెన్స్ ద్వారా డీఈవో, ఎస్ఎస్ఏ ఏపీసీ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు సూచనలు జారీ చేశారు. ఇప్పటి వరకు 65.35 శాతం ఐడీలు పూర్తయిందని చెప్పారు. ఆధార్‌లో సవరణలకు ఎలాంటి నోటరీ, అఫిడవిట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు సవరణలకు సంబంధించి వచ్చే దరఖాస్తులను వారి లాగిన్‌లో ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలే తమ పరిధిలోని పాఠశాలల్లోనే ఆధార్ అప్‌డేషన్‌కు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు.. సచివాలయ పరిధిలో ఆధార్ సవరణలకు వస్తే ఉచితంగా చేయాలన్నారు. కాగా, స్కూల్ రికార్డుల్లోని తప్పులు సరిదిద్దే అధికారాలను ఎంఈవో, గ్రేడ్2 హెచ్‌ఎం, డీవైఈవోలకు 2025 మార్చి వరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చినట్లు డీఈవో వరలక్ష్మి పేర్కొన్నారు.

బంగారు గొలుసు దోపిడి

వారం తర్వాత ఇంటికి చేరిన వైనం

పూతలపట్టు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దోపిడీకి గురైన బంగారు గొలుసు వారం తర్వాత ఇంటి గేటుకు తగిలించిన కవర్‌లో కనిపించింది. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూర్ణ అనే వ్యక్తి ఓ ప్రైవేటు డెయిరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను రంగంపేట సమీపాన ఉన్న వైఎస్సార్ కాలనీ వద్ద నివాసం ఉంటున్నాడు. వారం కిందట ఇతని భార్య పట్టపగలు ఇంటి ముందు ఉండగా గుర్తుతెలియని ఇద్దరు యువకులు ఆమె వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకించారు. తర్వాత ఆమె చేతిని వెనక్కి తిప్పి మెడలోని రూ.లక్ష విలువచేసే బంగారు గొలుసును లాక్కెళ్లిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఉదయం పూర్ణ ఇంటి గేటుకు ఓ నల్లటి కవర్‌లో చోరీకి గురైన బంగారు గొలుసు పెట్టి ఉన్నారు. ఉదయం ఆమె కుటుంబీకులు నల్లకవర్‌లోని బంగారు గొలుసును చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

చౌడేపల్లె : బత్తలాపురంలో పలు అభివృద్ధి పనులకు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. రూ.10లక్షల వ్యయంతో మురుగు కాలువల నిర్మించనున్నట్లు తెలిపారు. నాయకులు కళ్యాణ్, చంద్రమౌళి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు చల్లా బాబు పులిచెర్ల పర్యటన

కల్లూరు : పులిచెర్లలో మంగళవారం నిర్వహిస్తున్న కార్యకర్తల సమావేశానికి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డి హాజరవుతున్నట్లు ఆ పార్టీ నాయకుడు కుమార్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఎస్వీయూ యూత్ ఫెస్టివల్‌లో కేడీసీ విద్యార్థుల ప్రతిభ



కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యూత్ ఫెస్టివల్‌లో బీసీఎన్ విద్యా సంస్థలకు చెందిన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి వివిధ అంశాలలో బహుతులు గెలుచుకున్నారు. ఈ కళాశాలనుంచి మొత్తం 24 మంది విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. బీకామ్(సీఏ) ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్.చరణ్ మిమిక్రీలో, బీసీఏ మొదటి సంవత్సరం విద్యార్థి ఆదిచరణ్ ఫొటోగ్రఫీలో తృతీయ బహుమతులు పొందారు. వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్ విజేతలను అభినందించారు.

ఎంవీఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



గంగవరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంవీఆర్ డిగ్రీకళాశాల విద్యార్థులు ఎస్వీయూ యూత్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరచి సత్తాచాటారని ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తెలిపారు. ఈనెల 8 నుంచి 10వ తేది వరకు ఎస్వీ యూనివర్శిటీలో జరిగిన యూత్ ఫెస్టివల్‌కు ఎంవీఆర్ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. ఇన్‌స్టాలేషన్ విభాగంలో శివమణి, హరికృష్ణ, ప్రవీణ్‌లు ప్రథమ బహుమతి, రంగోలి విభాగంలో తోఫిక్, ఉమాగాయత్రిలు ద్వితీయ స్థానం, పెయింటింగ్ విభాగంలో టి. హేమంత్ ద్వితీయ స్థానంలో గెలుపొందారన్నారు. మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆదర్శ పాఠశాల స్థలం సర్వే

రొంపిచెర్ల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదర్శ పాఠశాల ఆటస్థలం ఎంపికకు సోమవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. గతంలో పాఠశాల భవనాలకు, ఆట స్థలానికి 5.45 ఎకరాల స్థలం కేటాయించారు. పాఠశాల పక్కనే జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. దీంతో భూముల విలువ పెరగడంతో పాఠశాలకు కేటాయించిన స్థలం కొంతవరకు ఆక్రమించారు. పాఠశాల స్థలం సర్వే చేసి ఆట స్థలం చూపించాలని ప్రిన్సిపాల్ బి.ఆర్. సరళతోపాటు పాఠశాల కమిటీ తహసీల్దార్‌ను కోరారు. దీంతో తహసీల్దార్ వచ్చి తన సిబ్బందితో సర్వే చేయించారు. అక్కడికి వచ్చిన మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ ప్రహరీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు, కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, సర్వేయర్ హరి, ఆర్ఐ సుధాకర్‌నాయక్, వీఆర్వో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



గోవిందపల్లెలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంపై ర్యాలీ

రామకుప్పం, నవంబరు 11: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, ఉన్సిగానిపల్లె సర్పంచు నేత్రావతి కోరారు. సోమవారం గోవిందపల్లెలో పారిశుధ్య కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కూడా తమ ఇళ్ళ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు శంకర్‌చలం, గుర్రప్ప, మహేంద్రనాయుడు, మణేష్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరెడ్డి

రొంపిచెర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈనెల 12 నుంచి 17 వరకు సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెత్తదిబ్బల తొలగింపు, తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద నీటి నిల్వలు లేకుండా శుభ్రం చేయాలని, రోడ్లకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు చర్యలు చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించి, మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ సత్యంరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్తి గొడవల్లో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఆస్తి గొడవల్లో ఓ వ్యక్తి గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పుంగనూరు మండలం మేలుందొడ్డికి చెందిన నరసింహులు అదే గ్రామానికి చెందిన సాలార్‌సాహెబ్ వద్ద 2002లో వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. అయితే సాలార్‌సాహెబ్ కుమారుడు ఖాదర్‌సాహెబ్ అదే భూమిని రామయ్యకు విక్రయించాడు. ఇరువర్గాలు ఘర్షణపడి 2018లో కేసులు పెట్టుకుని కోర్టుకు వెళ్లారు. సోమవారం రామయ్య కుటుంబసభ్యులు పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నడానికి వెళ్లారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడుతుండగా రామయ్య కుటుంబ సభ్యుడు శంకర్... నరసింహులు కుమారుడు నారాయణపై దాడి చేయడంతో నారాయణ గాయపడ్డాడు. గాయపడిన నారాయణను కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై కాంగ్రెస్ నిరసన



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ కాంగ్రెస్‌పార్టీ పట్టణ కార్యదర్శి సాజిద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కరువుకాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఈ ముబారక్, ఫయాజ్, మోసి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు పందుల బెడద





రొంపిచెర్ల మండలంలో పంటలపై అడవి పందుల దాడులు తప్పడంలేదు. చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల, గానుగచింతల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. వీటి నుంచి పంటల రక్షణకు బట్టలు, దిష్టి బొమ్మలు వంటివి పెట్టి బెదిరింపు చర్యలు చేస్తున్నా, నివారించలేకున్నారు. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నందున రైతులు రాత్రుల్లో శబ్దాలు చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. నిద్రలేని రాత్రులు గడపడం మాకు తప్పదని రైతులు అంటున్నారు. - రొంపిచెర్ల

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరి నోములు



ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి, ఆలయం ముందు దీపాలు వెలిగిస్తున్న భక్తులు, నోముల వ్రతాలు చేస్తున్న భక్తులు

పుంగనూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో సోమవారం కేదారేశ్వరిదేవి నోములు ఘనంగా నిర్వహించారు. స్థానిక భోగనజుండేశ్వర స్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి తదితర ఆలయాలకు మహిళలు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. అర్చకులు గౌరీదేవి చరిత్రను చదివి వినిపించారు. భక్తులు చేతికి నోముదారం కట్టుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

చౌడేపల్లె : కేదారీశ్వర నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్తీక మాస రెండవ సోమవారం స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అర్చకులు కేదారీశ్వరనోముల వ్రత కథను వివరించి నోములు వ్రతాన్ని భక్తులచే అచరింప చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సోమల : సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని గౌరీ దేవికి నోములు నోచుకున్నారు. పురోహితులు విద్యాసాగర్ గౌరీ వత్ర సంకల్ప కథను భక్తులు వినిపించారు. అలాగే పెద్దఉప్పరపల్లె, కందూరు, వల్లిగట్ల శివాలయాల్లో గౌరీ నోముల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని దుర్గంకొండ గార్గేయ మునీశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా అర్చకులు త్రివిక్రమ శర్మ మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారోత్సవం



రామకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద - రొంపిచెర్ల సిద్దలింగేశ్వర స్వామి ఆలయంలో నోములు

రామకుప్పం/రొంపిచెర్ల , నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం కార్తీక సోమవారోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాత్రి భక్తులు ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణ శివార్లలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద గల నక్షత్ర, రాశీ, నవగ్రహ వనంలో కార్తీక సోమవారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వనంలో దేవతామూర్తులు, దేవతావృక్షాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. రొంపిచెర్ల మండలంలోని పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరస్వామి, రొంపిచెర్ల సిద్దలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు సామూహికంగా కేదార గౌరీ నోములు నోచుకున్నారు. ఉదయం ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు ఆలయాల్లో కార్తీక దీపారాధనలు చేశారు.

అర్జీల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం : కడా పీడీ



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజా వినతుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమివ్వాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్) కచ్చితత్వంతో ఉండాలన్నారు. కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రజలనుంచి వస్తున్న వివిధ సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాన్ని కచ్చితమైన సాంకేతిక సమాచారంతో నివేదించాలన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్పించానని తెలిపారు. కడా పరిధిలోని నాలుగు మండలాలలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.110 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో కడా పరిధిలోని 18 ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి మా భూములను తొలగించండి



ఆవులపల్లె రైతుల నిరసన

సోమల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులపల్లె సీతమ్మ చెరువు వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం గత వైసీపీ ప్రభుత్వం 911 ఎకరాల వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిందని, ఆ జాబితా నుంచి తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణం కోసం అప్పటి తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి రైతుల అనుభవంలోని 911 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి వన్‌బీలు లేకుండా చేశారని వాపోయారు. జమీందారుల నుంచి కొనుగోలు చేసిన, పూర్వీకుల నుంచి తమ అనుభవంలో ఉండిన మామిడి చెట్లు, ఆస్తులను ప్రభుత్వ ఆస్తులుగా అన్యాయంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు మార్చారని, వన్‌బీలు రాకుండా ఎలాంటి లావాదేవీలు జరగకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశా రు. కలెక్టర్, జేసీ అధికారులు స్పందించి ఆవులపల్లె ప్రాజెక్టు ముంపు భూము లకు వన్‌బీ ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమల ఎస్ఐ శివశంకర, డీటీ ఇబ్రహీం రైతులతో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణాపురం, బయ్యారెడ్డిపల్లె, దేవళకుప్పం, మల్లేశ్వరపురం రైతులు, వేణుగోపాల్ నాయుడు, లక్ష్మీపతి నాయుడు, శేషాద్రి నాయుడు, జాఫర్ సాహెబ్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం సేవలు అమూల్యం



మాట్లాడుతున్న కుప్పం కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమూర్తి, సోమల కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం

కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నారాయణమూర్తి, తెలుగు విభాగాధిపతి చంద్రబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు జి.నాగరాజు, సుదర్శనం, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కుప్పం పురపాలక సంఘం పరిధిలోని సామగుట్టపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఆజాద్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు గాలి సురేశ్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, శాంత, గాయత్రి, విజయనిర్మల, సరస్వతి పాల్గొన్నారు.

సోమల : సోమల జూనియర్ కళాశాలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు మాట్లాడుతూ అబుల్ కలాం విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. అధ్యాపకులు గౌతం, శివయ్య, వెంకటరమణ, నాగరత్న , విద్యార్థులు పాల్గొన్నారు.

15న కార్తీక దీపోత్సవం

చౌడేపల్లె,నవంబర్11(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వహ కులు సుధాకర్‌బాబు, రాజేశ్వరి దంపతులు పేర్కొన్నారు. స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజ యేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆలయంలో 80 అడుగు రాతి ధ్వజ స్తంభంపై అఖండ దీపాన్ని వెలిగించి కార్తీక దీపోత్సవం నిర్వహించన్నుట్లు తెలిపారు.

నేడు రొంపిచెర్లలో టీడీపీ కార్యకర్తల సమావేశం

రొంపిచెర్ల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రొంపిచెర్లలో మంగళవారం పుంగనూరు నియో జకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఆధ్వ ర్యంలో కార్యకర్తల సమావేశం ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు రమణ తెలిపారు. సమావేశంలో అభి వృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఏపీవోగా చిన్నరెడ్డెమ్మ



చౌడేపల్లె,నవంబర్11 (ఆంధ్రజ్యోతి) : చౌడేపల్లె ఏపీవోగా చిన్నరెడ్డెమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ..పెద్ద పంజాణి మండలంలో ఏపీవోగా పని చేస్తున్న తాను ఉన్నతాధికారుల ఆదేశాలతో చౌడేపల్లెకు బదిలీ అయినట్లు తెలిపారు. ప్రతి కూలీకీ ఉపాధి పని కల్పించటమే లక్ష్యమని తెలిపారు.

విద్యార్థులకు ఫీజు సాయం



కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజుకు సంబంధించి రూ.10వేలను కల్లూరుకు చెందిన వ్యాపారవేత్త మాచారం మహేష్ విరాళంగా అందజేసినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారులు మువ్వల శేఖర్, నందకుమార్, ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం గణేశ్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (ఎస్టీ) పోస్టు ఖాళీగా ఉన్నట్లు సీడీపీవో ఆర్.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీన స్థానిక సీడీపీవో దరఖాస్తులు ఇస్తారన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అవసరమైన ధ్రువపత్రాలు జతపరచి ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

బోడిపాటివారిపల్లెలో...

రొంపిచెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బోడిపాటివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు (ఓసీ)కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీసీ సూపర్‌వైజర్ శిరీష్ తెలిపారు. స్థానికులై ఉండి 10వ తరగతి చదివి 21-35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వివాహితులు ఈ పోస్టుకు అర్హులన్నారు.

ఎస్ఐకి సత్కారం



రామకుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రామకుప్పం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటమోహన్‌ను టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, హరీష్‌ల ఆధ్వర్యంలో సోమవారం కూటమి నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజకీయపక్షాలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్, పవన్, బాస్కర్, గంగాధర్, ఆంజి, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో విద్యార్థిపై దాడి

పుంగనూరు రూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జాతరలో విద్యార్థినిని మరో విద్యార్థి దాడి చేసి గాయపరిచాడు. రామసముద్రంలో నివాసముండే రామాంజులు కుమారుడు ఆకాశ్(12) ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన దొడ్డపల్లెలో జరుగుతున్న జాతరకు కుటుంబసభ్యులతో కలసి వెళ్లాడు. జాతరలో పండ్లు కొనుగోలు చేసి తింటుండగా మరో విద్యార్థి సుదర్శన్ తినడానికి పండ్లు అడగగా ఇవ్వకపోవడంతో దాడి చేసి గాయపరిచాడు. కుటుంబసభ్యులు గాయపడిన ఆకాశ్‌ను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కల్లూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం చిట్టారెడ్డిపేట సమీపంలోని సదుం రోడ్డులో చిట్టారెడ్డిపేటకు చెందిన లోకేష్ ఇంటి వద్ద 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పోలీసులకు ముందుగా అందిన సమాచారం మేరకు ఆ ఇంటిపై దాడి చేయగా 40 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామని, ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్తలను ఆదుకునే పార్టీ టీడీపీ

రామకుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకునే ఏకైక పార్టీ టీడీపీనేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మెన్ సీతాపతి తెలిపారు. సోమవారం వారు రామకుప్పంలో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఒక కుటుంబంలో ఎంతమందైనా పార్టీ సభ్యత్వం తీసుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు సలాంసాబ్, టీవీరవి, బాలరాజు, సుబ్రీ, ఆదిల్, హరి, అవినాశ్, అమరనాథ్, మంజునాథ్, చాన్‌బాషా పాల్గొన్నారు.



చెత్తతో నిండిన గ్యాలరీ (ఇన్‌సెట్‌లో) మద్యం సీసా

మైదానమా.. చెత్తకుండీనా?

క్రీడాకారుల ఆవేదన

చిత్తూరు మెసానికల్ మైదానం చెత్తకుండీలా మారింది. ఇక్కడ నిత్యం బ్యాస్కెట్‌బాల్, స్కేటింగ్, ఫుట్‌బాల్, కరాటే, ఖోఖో తదితర క్రీడల్లో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ఉదయం, సాయంత్రాల్లో స్థానికులు వాకింగ్ చేస్తుంటారు. మైదానం నిర్వహణను డీఎస్‌ఏ అధికారులు గాలికి వదిలేయడంతో గ్యాలరీలు చెత్తకుండీలను తలపిస్తున్నాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలన్నీ పూడిపోయి వర్షపునీరు మైదానంలో నిలిచి, బురదమయం అవుతోంది. రాత్రిపూట లైట్లు వెలగడక పోవడంతో మందుబాబులు ఇక్కడే పార్టీలు చేసుకుంటున్నారు. గ్యాలరీలకు పగుళ్లువచ్చి అందులో మొక్కలు మొలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



పగుళ్లలో మొలిచిన మొక్కలు

ఇక్కడ ఖననం చేయడమెలా?

ఈ ఫొటోలో కనిపిస్తున్నది కార్వేటినగరం వైకుంఠ మహాప్రస్థానం. ఇది కార్వేటినగరం నుంచి పచ్చికాపల్లం రహదారి మార్గంలో చిన్నకనుమ సమీపంలో ఉంది. కార్వేటినగరంలో ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి కేటాయించిన స్థలం. ఇక్కడున్న ముళ్ల, పిచ్చి మొక్కలు, చెట్లను చూస్తే ఇక్కడ ఖననం చేయడానికి వీలవుతుందా అన్న ప్రశ్న ఎవరిలోనైనా రేకెత్తిస్తోంది.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి



ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగయ్య కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో షాదీఖానాలు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో మంచి ప్రభుత్వం నడుస్తోందన్నారు. సంక్షేమ పథకాలను మైనార్టీ సంక్షేమాధికారి చిన్నారెడ్డి వివరించారు. అనంతరం జీజేఎం ట్రస్టు ఆధ్వర్యంలో 815 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలను వితరణ చేశారు. ట్రస్టు డైరెక్టర్ చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేతలు సురేంద్రకుమార్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న దొరబాబు, చెన్నకేశవులునాయుడు

గుంతలో దిగబడిన బస్సు / రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

యాదమరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓ బస్సు గుంతలో దిగబడటంతో రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు ఆలయాల సందర్శనార్థం తమిళనాడుకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. యాదమరి మండలంలోని చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలోకి సోమవారం సాయంత్రం ఈ బస్సు వచ్చింది. ఈ రహదారి మరమ్మతులకు నోచుకోక గుంతలమయంగా ఉండడంతో కె.కొత్తూరు వద్దకొచ్చేసరికి ఓ భారీ గుంతలో బస్సు దిగబడిపోయింది. దీంతో ఇరువైపులా దాదాపు రెండు గంటల పాటు స్తంభించింది. పోలీసులొచ్చి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గతవారం ఇదే రహదారిలోని గుంతలకు ఓ వ్యక్తి బలయ్యాడు. ఇకనైనా ఈ రోడ్డును బాగు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.



చుడా చైర్‌పర్సన్‌కు సన్మానం

గుడిపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చూడా చైర్‌పర్సన్‌గా నియమితులైన కటారి హేమలతను సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండల మాజీ అధికార ప్రతినిధి తుమ్మల సాంబశివ నాయుడు, నాయకులు శంకర్ చౌదరి, రవి నాయుడు, గోపి, గోవింద గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చుడా కార్యాలయ సిబ్బంది కూడా హేమలతకు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డిని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనను వన్నియకుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా ధన్యావాదాలు తెలిపారు. పాకాల మాజీ తెలుగుయువత అధ్యక్షుడు మాన్యం కిషోర్ నాయుడు పాల్గొన్నారు.



'బలహీన వర్గాల బడ్జెట్'

చిత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టినట్లు ఉందని ఈశ్వర్‌నాయుడు (ఈశ్వర్ అభయ ట్రస్టు చైర్మన్, బంగారుపాళ్యం) తెలిపారు. 'ఎస్సీల సంక్షేమానికి రూ.18 వేల కోట్లు, ఎస్టీల కోసం రూ.7వేల కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు, మైనార్టీల కోసం రూ.4వేల కోట్లు కేటాయించారు. ఇది సాధారణ విషయం కాదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఆయా రంగాలకు కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వడం శుభపరిణామం. అందులో భాగంగానే ఆర్‌అండ్‌బీకి రూ.9554 కోట్లు కేటాయించింది' అని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



యాదమరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదమరి పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం కోడిగుట్ట గ్రామంలో ఎన్‌సీడీసీడీ ట్రయల్ సర్వే సోమవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఈ సర్వేను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి కాలనీలో అంధకారం

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీ నాల్గవ వీధిలో వారం రోజులుగా రాత్రిపూట వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. గతంలో ఉన్న ఎల్‌ఈడీ దీపాలు వర్షాల సమయంలో పాడయ్యాయి. మరోవైపు వీధి మధ్యలో ఉన్న ఓ చిన్న పరిశ్రమను మూసేశారు. దీంతో అక్కడ పిచ్చిమొక్కలు పెరిగి, విషపురుగులు చేరాయి. రాత్రిపూట అవి ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దిగువపల్లాలు గ్రామంలో రూ.4లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి సోమవారం ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మురుగు, దుర్గంధానికి తాత్కాలిక పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. మురుగు, దుర్గంధం నడుమ జీవనం అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులొచ్చి పరిశీలించారు. మురుగు వెళ్లడానికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో మురుగును, పిచ్చిమొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి వదిలేశారు. దాంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైనా రెండు, మూడ్రోజుల్లో మళ్లీ మురుగు నిల్వ చేరుతుందని స్థానికులు చెబుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



26న దేశవ్యాప్త నిరసన: సీపీఐ

నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26వ తేదీన దేశవ్యాప్త నిరసన చేయనున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు తహసీల్దారు రవికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు వేలన్, షబ్బీర్ బాషా, రాజేంద్రన్, ఇంద్ర, భాస్కర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడండి

క్వారీల వద్ద యువకుల నిరసన



నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు శివార్లలో గ్రావెల్ తవ్వకాలతో అడవులు తరిగిపోతున్నాయని స్థానిక యువత నిరసన వ్యక్తం చేవారు. కీళపట్టు, పెరుమాల్‌నగర్, కావేటిపురం, నాగరాజకుప్పం, బీరకుప్పం, కన్నికాపురం, ఓజీకుప్పం, నెత్తకండ్రిగ, వీకేఆర్‌పురం యువత ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి క్వారీలను ఆపు చేయించాలని అధికారులకు వినతిపత్రం అందించారు. క్వారీ జరుపుతున్న అటవీ ప్రాంతం చుట్టూ 11 గ్రామాలున్నాయని, ఈప్రాంతంలో 2వేల మంది జనాభా ఉన్నారని చెప్పారు. పైగా పశువులు మేపుకోవడానికి ఈఅటవీ ప్రాంతం అనుకూలంగా ఉందని, క్వారీలు ఆపించాలని కోరారు.

శివాలయాలకు కార్తీక శోభ

చిత్తూరు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో కార్తీకమాస రెండో సోమవార పూజలను భక్తులు నిర్వహించారు. కట్టమంచి కులందేశ్వర ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేకఅభిషేకం, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, కాశీ విశ్వేశ్వర (రాజుగుడి), సంతపేట కనకదుర్గ, ఇరువారం నాగేంద్ర స్వామి ఆలయాల్లోనూ పూజలనునిర్వహించారు.

మొగిలీశ్వరాలయంలో..

బంగారుపాళ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలో ప్రసిద్ధి చెందిన స్వయంభు మొగిలీశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ఆవరణంలోని చెట్టుకింద దీపారాధన చేశారు. ఆలయానికి అనుబంధమైన దేవరకొండలో జలకంఠేశ్వరస్వామికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మణికంఠేశ్వర స్వామి ఆలయంలో..

ఐరాల(కాణిపాకం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలను భక్తులు నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు ఆలయానికి ఉపవాస దీక్షతో విచ్చేసి.. స్వామి అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదం స్వీకరించి, ఉపవాస దీక్షను విరమించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు పర్యవేక్షించారు.



మణికంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు





చిత్తూరులోని కట్టమంచి కులందేశ్వర, మొగిలి ఆలయంలో మహిళల దీపారాధన, పూజలు

సంక్షిప్తంగా..

అంధకారంలో కేశవపురం

విజయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోసలనగరం పంచాయతీ కేశవపురం గ్రామంలో రాత్రయితే అంధకారం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, కొన్ని వీధులను మరిచారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యాకమిటీ చైర్‌పర్సన్ తనిఖీలు

గుడిపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యాకమిటీ చైర్‌పర్సన్ డిల్లీబాయి సోమవారం తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణం, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ సతీష్, హెచ్‌ఎం ఖాతుంబీ, కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

గుడిపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల వద్ద ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రామ్మోహన్ హెచ్చరించారు. సోమవారం బొమ్మసముద్రం, నరహరిపేట, కమ్మతిమ్మాపల్లి క్రాస్, జడ్పీ హైస్కూల్ వద్ద ఈవ్ టీజింగ్‌పై ఫిర్యాదులు అందడంతో తమ సిబ్బందితో నిఘా పెట్టి, కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

గంగాధరనెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నివాసప్రాంతాల వద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. గంగాధరనెల్లూరు, పెద్దకాల్వ, నందనూరు, ముక్కశత్తూరు, కొండేపల్లె పంచాయతీల్లో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, కిరణ్‌కుమార్, చిట్టెమ్మ, శివయ్యకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్ కండ్రిగ జడ్పీ హైస్కూల్లో 156మంది విద్యార్థులకు కంటిపరీక్షలు సోమవారం నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చెందిన కంటివైద్య నిపుణుల బృందం ఎస్.మంజులవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్ పరిశీలన

పాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆధార్‌క్యాంప్‌ను ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్‌డీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో జరిగిన యువతరంగ్‌లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సర బీజడ్‌సీ విద్యార్థిని యామిని.. రంగోళిలో ద్వితీయస్థానాన్ని సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈమెను సోమవారం అధ్యాపకులతో కలిసి అభినందించారు.

'అంగన్వాడీలపై పనిభారం'

చిత్తూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఐసీడీఎస్ పీడీ హైమావతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీలు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, అరుణ, భాగ్య, ప్రేమ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

బంగారుపాళ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

విద్యా సామగ్రి వితరణ

విజయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇల్లత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, దొరస్వామి సోమవారం విద్యా సామగ్రి వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

చిత్తూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడిసాయంగా రూ.20వేలను ఇస్తామని చెప్పిన మాటను కూటమి నాయకులు నిలబెట్టుకోవాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు కోరారు. ఈ మేరకు చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కళావతికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లో పెండింగ్‌లోని ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం కాకుండా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను వదిలిపెట్టి.. కోటీశ్వరులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఈనెల 26వ తేదీన ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. నాగరాజు, సురేంద్రన్, దామోదరం, విజయగౌరి, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



పోటీల్లో ప్రతిభ చూపిన న్యూయార్క్ విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని స్థానిక న్యూయార్క్ స్కూల్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. ప్రపంచ సైన్స్‌డేని పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటి



నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పాండ్యన్, కార్యదర్శిగా షారూఖ్, ఉపాధ్యక్షులుగా దిలీప్, లక్ష్మీప్రసాద్, జానకిరామ్, సహాయ కార్యదర్శులుగా విఘ్నేష్, విష్ణుసాయి, విష్ణు, కోశాధికారిగా స్యోతిరామ్, కార్యవర్గ సభ్యులుగా ఆదిత్య, మహేష్, సాయికుమార్, నితిన్‌చంద్ర, పృథ్వీ ఎంపికయ్యారు. బాలికల కన్వీనర్లుగా మేనక, ఉమను ఎంపిక చేశారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజారోగ్యవిభాగం, మెప్మా, టిడ్కోకు రెండు అర్జీల చొప్పున, ఇంజనీరింగ్‌కు ఒక అర్జీ అందింది. సహాయ కమిషనర్ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం: వైసీపీ



చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తే సహకరిస్తామని, చేయకుంటే మాత్రం నిలదీస్తామని వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మార్కెట్ గేటు ఫీజు చెల్లించలేక పోయానన్నారు. అధికారంలో ఉన్న వారు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబరు అనూ, పలువురు నేతలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో నిర్వహించిన యువ తరంగ్‌లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. బి.జీవన్, వి.వెంకటేష్, ఎస్.సంధ్య, సబిహా అన్సారీ, జోషిక, కె.బన్నీ, ఎల్.గోమతి, విఘ్నేష్, మోహన్, విజయలు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించినట్లు వివరించారు. వీరిని సోమవారం అధ్యాపకులతో కలిసి అభినందించారు.

అన్నిరంగాల్లో రాణించాలి: డీవీఈవో

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని డీవీఈవో సయ్యద్ మౌల సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని బీఎన్ కన్నన్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ● ఎస్‌పీఎస్ మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన రెడ్‌క్రాస్ వారి సహకారంతో విద్యార్థులు రక్తదానం చేశారు.

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా కోదండరామిరెడ్డి

శ్రీరంగరాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముద్దికుప్పం గ్రామ పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డిని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆజాద్‌కు నివాళి

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు టీడీపీ నేతలు నివాళి అర్పించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నేతలు మాట్లాడుతూ.. విద్యతోనే మనిషి అభివృద్ధి చెందుతాడని నిరూపించిన వ్యక్తి అని ప్రశంసించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నేతలు మోహన్ రాజ్, విజయకుమార్, ఫిరోజ్ బాయ్, జాఫర్, అత్తుబాయ్, అన్సర్, గౌస్ బాషా, మున్న, ప్రభుతేజ, యువరాజులు నాయుడు, రవి, సురేష్ పాల్గొన్నారు.

విద్యారంగంలో సేవలు మరువరానివి

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువరానివని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి అన్నారు. సోమవారం ఆ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు